**ఆడా, మగా ఇద్దరూ కలిసి ఆనందం సమానంగా పంచుకున్నప్పుడు బాధ్యత చెరోవిధంగా వుండటం యేం న్యాయం?**

రాజేశ్వరి ఇంకా నవల చదువుతూనే ఉండడం చూసి యశోదకు చిరాకు కలిగింది.

''అవతల వాళ్ళొచ్చే టైమయిందని చెప్తుంటే నీక్కాదా ఏమిటి?'' అంది కోపంగా.

''వస్తున్నానే! ఇంకో నాలుగు పేజీలే మిగిలాయ్....'' అనేసి మళ్ళీ నవలలో నిమగ్నమయిపోయింది రాజేశ్వరి.

యశోద గొణుక్కుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

మరో పావుగంట తర్వాత పుస్తకం చదవడం ముగించి లేచి హాల్లోకి నడిచింది రాజేశ్వరి.

హాల్లో సోఫాలూ, కుర్చీలూ అన్నీ నీట్‌గా చూడముచ్చటగా సర్దేసింది యశోద.

ఈ ఆరునెలలనుంచీ పెళ్ళి చూపులు బాగా రొటీన్ అయిపోయాయి.

రాజేశ్వరి బాత్‌రూమ్‌లోకెళ్ళి మొఖం కడుక్కుని మళ్ళీ తన గదిలో కొచ్చి అద్దంముందు నిలబడింది.

అప్పుడే చదవడం ముగించిన నవలలోని హీరోయిన్ జానకిపాత్ర యింకా కళ్ళల్లోనే వుంది.

ఇలాగే పెళ్ళి చూపులకోసం యెన్నో సార్లు తయారయి చివరకు విసుగుపట్టి ఓ వ్యక్తికి రెండోభార్య అవడానికి సిద్ధపడుతుంది. అప్పుడు ఓ కుర్రాడు ఆమెని ప్రేమించి పెళ్ళిచేసుకుంటాడు

డిగ్రీ పూర్తయిన దగ్గర్నుంచీ ఏ నవల పడితే ఆ నవల చదివేయడం అలవాటయిపోయింది తనకి. అంతకంటే కాలక్షేపం కూడా ఏముంది గనక? కాలేజీలో చదివేప్పుడు క్షణం తీరిక లభించేది కాదు. ఎప్పుడయినా కొంచెం సమయం దొరుకుతే వార పత్రికలు, న్యూస్ పేపర్లు చదవడమే।

అసలు తనకు ఇప్పుడే పెళ్ళి చేసుకోవాలని కూడా లేదు. అందుకే ఎమ్మెస్సీలో చేరతానని గొడవచేసిందిగానీ తల్లిదండ్రులు ఒప్పుకోలేదు పై చదువులు చదివినకొద్దీ తన వివాహం ఓ సమస్య అయిపోతుందని వారి భయం.

చేసేదిలేక పెళ్ళి చూపులకు అప్పుడప్పుడు హాజరవుతూ యింట్లోనే గడుపుతోంది.

ఇంతవరకూ నాలుగు సంబంధాలు చూడడం జరిగింది.

అందులో ఒకరిద్దరికి తను నచ్చలేదు. మరొక రిద్దరికి తనిచ్చేకట్నం చాల్లేదు.

ఎటొచ్చీ అనుకోకుండా నెలరోజుల క్రితం ఓ తమాషా జరిగింది. తమ ఎదుటింట్లో కొత్తగా అద్దెకు దిగినవారితో తమకు పరిచయమయింది వాళ్ళమ్మాయి సురేఖదికూడా తన వయసే. తను వారింటికి వెళ్ళడం-రావడంలో-తనను విపరీతంగా అభిమానించడం ప్రారంభించారు ఆమె తల్లిదండ్రులు. ఆ అభిమానంతోనే తనను వారి కోడలుగా చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. సురేఖ అన్నయ్య వైజాగ్‌లో ఏదో కంపెనీలో ఎకౌంటెంట్‌గా పన్జేస్తున్నాడట.


ఆమె తల్లిదండ్రులూ, తన తల్లిదండ్రులూ తను వివాహానికి సంబంధించిన అన్ని విషయాలు మాట్లాడుకోవడం జరిగిపోయింది. అతను ఎలాగూ పండుగకు శెలవుల్లో ఇంటికొస్తున్నాడనీ. కనుక అతనుకూడా ఓసారి తనను చూస్తే లగ్నాలు పెట్టుకోవచ్చనీ ఎదురుచూడసాగారందరూ.

ఈ లోగా ఓ రోజు సురేఖ వాళ్ళ ఫొటో ఆల్బమ్ తీసుకొచ్చింది తన దగ్గరకు.

"నువ్వు మా అన్నయ్యను చూడలేదు కదా! అందుకని అంత వరకూ అన్నయ్య ఫొటో చూసి సంతృప్తిపడు...." అంది నవ్వుతూ

తను ఆత్రుతగా ఆల్బమ్ తీసి అతని ఫొటో కోసం వెతకసాగింది.

అయిదో పేజీలో అతని ఫొటో చూసి





# తప్పు

యర్రంశెట్టి సాయి

తుతిపోయినట్లయింది తనకి.

తకీమని అతనిని గుర్తుపట్టేసింది.

మనసులో ఆనందం, తీయనిబాధా రెండూ ఒకేసారి కలిగినయ్.

సుధీర్!

అవును! తన సుధీరే!

ఎన్నాళ్ళయిందతనిని చూసి? ఏడు-ఊహూ-ఎనిమిదేళ్ళు-రెండు నెలల పరిచయం తమది - ఆ తరువాత అతనేమయాడో - తనేమయిందో - మళ్ళీ ఇప్పుడు యిన్నేళ్ళకు-యిలా - కాబోయే భార్యాభర్తలుగా!

ఆమెకు ఆలోచిస్తున్నకొద్దీ ఆశ్చర్యంగా ఉంది.

ఇలా ఎక్కడయినా జరుగుతుందా?

ఈ ఎనిమిదేళ్ళకాలం-ఆ జ్ఞాపకాలనూ, ఆ అనుభూతినీ- అట్టడుగుకి తోసేసింది.

"అమ్మా!" ఆల్బమ్ తీసుకుని ఆనందంతో తల్లి దగ్గరకు పరుగెత్తింది రాజేశ్వరి.

"ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది యశోద

"సురేఖా వాళ్ళన్నయ్య ఎవరో తెలుసా"

ఆమెకా ప్రశ్న అర్థం కాలేదు. "అంటే?"

"ఇదిగో- ఇతనే సురేఖ వాళ్ళన్నయ్య! ఇతనిని మనం అదివరకు చూశాం! ఎక్కడో చెప్పుకో!"

"ఏమో! నాకు గుర్తు రావడం లేదు." అందామె పరీక్షగా ఫొటో వంక చూసి.

"మనం ఒంగోలు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళినప్పుడు మనింటి కెదురుగ్గా రూమ్‌లో యితను అద్దెకుండేవాడు గుర్తులేదూ!"

యశోదకు అప్పుడుగానీ గుర్తు రాలేదు

"అవునవును! రెండు మూడు నెలలు ఆ గదిలో వున్నాడు. ఆ తరువాత వేరే వాళ్ళొచ్చారు. ఆయిల్లంతా తీసుకుని...."

"ఆ- అతనే- ఇతను!"

"అవును! ఇప్పుడు గుర్తొచ్చింది!"

"అయితే మా అన్నయ్య నీకు ముందే తెలుసన్నమాట!" అంది సురేఖ నవ్వుతూ.

ఆరాత్రి రాజేశ్వరికి నిద్రపట్టలేదు.

ఆనాటి మధురస్మృతులన్నీ వెలికివచ్చి

మనసులో ఆనంద పారవశ్యంలో మునిగి తేల సాగినయ్.

తాము ఒంగోలు వెళ్ళినప్పుడు తను టెన్త్‌క్లాస్ చదువుతోంది. ఆ ఇంట్లో దిగిన రెండో రోజే ఎదుటి గదిలో అతనిని చూసింది. అతనూ తనవంక ఆసక్తిగా చూడటం గమనించి చూపులు మరల్చు కొంది.

ఆ సాయంత్రం తను డాబా మీద కెళ్ళి నప్పుడు అతను కిటికీ దగ్గరే కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చేతిలో ఉంచుకుని తనవేపు దొంగచూపులు చూస్తూ కనిపిం చాడు.

ఎందుకో అతనివేపు పదేపదే తనకూ చూడాలనిపించింది. ఆ మర్నాడు అతను కాలేజీకెళ్తూ తనవేపు చూసి చిరునవ్వు నవ్వాడు. తన గుండెలు ఝల్లుమన్నాయ్. అలా తనతో బాగా పరిచయమున్నట్లు నవ్వుతాడెందుకు? అనిపించింది.

ఆ తరువాత కొద్దిరోజులకు తనకు తెలీకుండానే, వద్దనుకుంటూనే తనూ అత నిని చూసి నవ్వేది.

ఆ ప్రోత్సాహం అందుకుని అతను ఉత్తరం రాశాడు తనకి.

తను స్కూలుకెళ్తోంటే హఠాత్తుగా తనదగ్గరకొచ్చి తన చేతిలో ఓ కాగితం ఉంచి ఏమీ తెలీనట్లు తనదారిన తను వెళ్ళి పోయాడు.

దగ్గరలో ఎవరూ లేకపోవడంతో తన నెవరూ గమనించే అవకాశం లేకపో యింది.

ఆ రాత్రి అందరూ నిద్రపోయాక లైటు వేసుకుని వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఆ ఉత్తరం చదువుకుంది తను.

ఆ ప్రేమలేఖ తనను మైమరపించ జేసింది.

అతను తన నెంతగా ప్రేమిస్తున్నాడో విపరంగా, అందంగా రాసినుంది అందులో. ఆ ఉత్తరానికి తను జవాబు రాయాలని కూడా అర్థించాడు.

తను రెండురోజులు ఆలోచించి చివ రకు అతనికి జవాబు రాసింది. మరికొద్ది రోజుల్లో ఉత్తరాలద్వారా అతి సన్నిహితు లయిపోయారు ఇద్దరూ.

ఆయితే ఒకరితో ఒకరు మాట్లాడు కోవడం మాత్రం సాధ్యపడలేదు.

రెండునెలలు గడచిపోయినయ్.

అతను రాసిన ఆఖరి ఉత్తరం తనలో పెద్ద ఎత్తున కలవరం కలిగించింది.

మరో రెండు రోజుల్లో తన పరీక్ష లయి పోతాయనీ, ఆ తరువాత తను ఆ ఊరి నుంచి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాననీ, కనుక తామిద్దరూ ఈలోగా కొద్దినిమిషాల పేపయినా కలిసి మాట్లాడుకుంటే కనీసం ఆ అనుభూతిని జీవితమంతా మిగుల్చు కుంటాననీ, ఆ అవకాశం తనకు తప్పక యివ్వాలనీ రాశాడతను.

అతనితో - ఎవరికీ తెలీకుండా - ఎవరి కంటా పడకుండా రహస్యంగా ఎలా మాట్లాడాలో అర్థం కాలేదు తనకి!

రెండు రోజులు గడిచిపోయినయ్.

ఆ సాయంత్రమే అతను గది ఖాళీచేసి వెళ్ళిపోతాడు.

ఎలాగయినా అతని గదికి వెళ్ళి కొద్ది నిమిషాలు అతనితో మాట్లాడాలని తన మనసు ఉవ్విళ్ళూరుతోంది.

కానీ ఎలా వెళ్ళడమో తెలీడం లేదు.


మధ్యాహ్నం తన తల్లి ఏదో పనిమీద అదే ఊళ్ళో ఉన్న తమ బంధువింటికి వెళ్ళడంతో - తనకు అనుకోకుండా ఆ అవ కాశం వచ్చింది.

వెంటనే ధైర్యం తెచ్చుకుని రోడ్డుమీద ఎవరూ లేకుండా చూచి అతని గదికి చేరు కుంది.

అతను తనను గాఢంగా కౌగలించుకుని ముద్దులతో నింపేశాడు ఆవేశంగా.

అతని స్పర్శ తనను పిచ్చిదానిని చేసే సింది.

"రాజేశ్వరీ! నిన్నెంతగా ప్రేమిస్తు న్నానో తెలుసా? ఏనాటికయినా మని



ద్దరం భార్యా భర్తల మవాలి." అన్నాడు పెదాలమీద ముద్దు పెట్టుకుంటూ.

తను పూర్తిగా మైకంలోపడిపోయింది. అతను తీసుకుంటున్న చొరవను కాదన లేకపోతోంది. ఆనందం, ప్రేమ, భయం.

ఏం జరుగుతోందో తెలీటం లేదు.

"సుధీర్! ఇంక వెళ్ళిపోతాను" అంది భయంగా.

"అప్పుడేనా? అసలయిన ఆనందం అనుభవించవద్దూ...." అంటూ బట్టలు తొలగించబోయాడు.

"సుధీర్ -ఇవేమీ వద్దు-నన్ను వెళ్ళనీ" కంగారుగా అంది తను.

"ప్లీజ్ కాదనకు! మనం మళ్ళీ ఎప్పటికి కలుసుకుంటామో! కనీసం ఈ తీయని అనుభవమయినా మనకు మిగలాలి...." అంటూ ఆవేశంగా తనను పెనవేసుకోబోయాడతను.

ఇంక అతనిని ప్రతిఘటించడం తన వల్ల కాలేదు

ఆ సాయంత్రం అతను వెళ్ళిపోయాడు

కొద్ది రోజుల వరకూ తను మళ్ళీ మామూలు మనిషి కాలేకపోయింది. అతను వెళ్ళిపోయాడన్న దిగులు ఓ ప్రక్క. తను చేసిన తప్పు మరోపక్క తనను దారుణంగా బాధించినయ్.

క్రమేపీ తను వాటిని మనసులోనుంచి తొలగించగలిగిందిగనీ అప్పుడప్పుడూ అతను గుర్తుకొస్తూనే ఉండేవాడు. అతనితో చేసిన 'తప్పు' కూడా ఎప్పుడయినా ఓసారి మనసులో కలుక్కున గుచ్చుకుంటూండేది.

"ఏమిటలా కూర్చున్నావ్ రెడీ అవమంటే?" యశోద ఆమె అద్దంముందు అలంకరించుకోకుండా కూర్చుని వుండడం చూసి చకితురాలయి అడిగింది.

రాజేశ్వరి ఛటుక్కున ఆలోచనల్లోనుంచి తేరుకుని త్వరత్వరగా జడవేసుకోవడం ప్రారంభించింది.

ఇంతకూ తనే పెళ్ళికూతురన్న విషయం సుధీర్‌కి తెలీదు. తనను చూసి అతను నిర్ఘాంతపోతాడు ఆ తరువాత ఆశ్చర్యానందాలలో మునిగిపోతాడు

అనుకోకుండా ఇలా ఇద్దరూ - భార్యాభర్తలవడం ఎంత అద్భుతమయిన విషయం?

ఒకరి నొకరు అంతగా ప్రేమించుకుని ఇష్టపడి ఇన్నేళ్ళు ఎవరెక్కడున్నారో తెలీకుండా గడిపి మళ్ళీ ఇప్పుడీ బంధం ఎంత అదృష్టం తమది?

రెడీ అయి తలాకిటి గడపదగ్గరికొచ్చి నిలబడింది రాజేశ్వరి. సురేఖ కూడా


పళ్ల డాక్టరు చెబుతున్నారు

పళ్లు, చిగుళ్ల సక్రమ సంరక్షణకోసం

పళ్లను బ్రష్ చేసుకోవడం ఎంత ముఖ్యమో,

చిగుళ్లను మాలిష్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం

# ఫోర్‌హేన్స్ డబుల్ యాక్షన్ టూత్‌బ్రష్ వాడండి

మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్ కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది



మృదువైన తెల్లని కుచ్చులు మీ చిగుళ్లను మాలిష్ చేస్తాయి

దృఢమైన నీలిరంగు కుచ్చులు మీ పళ్లను శుభ్రపరుస్తాయి

ఫోర్‌హేన్స్ టూత్ బ్రష్

ఇంటిల్లి పాది కోసం

అడల్ట్ (మీడియం మరియు సాఫ్ట్), జూనియర్, బేబీ

Regd. T.M: Geoffrey Manners & Co. Ltd.

256 F-122 TEL



చిత్రకళ





స్థాపితం: 1957 ఫోన్ నెం 846 18

మీరు మీ ఇంటి యందుండే తపాల పాఠములద్వారా చిత్రకళ నేర్చుకొ రెండు సంవత్సరములలో ఉత్తమ చి కారులు కావచ్చును. యావద్భారత దేశమ నుండియు విదేశముల నుండియు అనే మంది మన విద్యాలయములో విద్యార్థులు చేరి ఉత్సాహంతో శిక్షణ పొందుచున్నా

మీరు కూడా ఈ సులభ పద్ధతుల చిత్రకళ నభ్యసించుటకు సమ్మతిం చున్నారా? వివరముల కొరకు తొమ్మి పది పైసల స్టాంపులు పంపండి.

SANTHANU'S CH
179, Singanna Chetty S Chintadripet, MADRAS-2.

వాళ్ళింటి గడపలో నుంచుని సుధీర్‌కోసం ఎదురుచూస్తోంది.

"పెళ్ళిచూపుల్లో ఎలాగూ చూస్తావుగా ! ఇంకా గడపలో పడిగాపులెందుకు ?" వెక్కిరింపుగా అందామె.

రాజేశ్వరి సిగ్గుపడి లోపలికొచ్చేసింది.

మరికాసేపట్లో సురేఖ వాళ్ళింటిముందు ఆటో ఆగిన చప్పుడయి మళ్ళీ గడప దగ్గరకు పరుగెత్తింది. అప్పటికే సుధీర్ ఆటో దిగి వాళ్ళ ఇంట్లోకి నడుస్తూ కనిపించాడు.

అతనిని పక్క నుంచి చూస్తూనే ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది రాజేశ్వరి.

అదే అందం- అదే నడక.

మరో గంటసేపటి తర్వాత అతను తల్లిదండ్రులతో పాటు తన ఇంటికి వచ్చి హాల్లో కూర్చున్నాడు.

తన గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్.

ఇంతకాలం తరువాత అతని కెదురుగా వెళ్ళాలంటే, అతనివంక చూడాలంటే ఏమిటోగా వుంది.

అతని కళ్ళలో తనను చూడగానే కనిపించే వెలుగు–తను చూసి తట్టుకోగలదా?

"రాజీ. పద హాల్లోకి...." యశోద పిలిచిందామెని.

రాజేశ్వరి తడబడుతున్న అడుగులతో హాల్లోకి నడిచింది.

"నమస్తే" అంది అతని వంకచూసి. అతనికెదురుగా ఉన్న సోఫాలో కూర్చుంటూ.

'నమస్తే' అంటూ ఆమెవంక చూసి షాక్ తగిలినట్లు అయిపోయాడతను! అతని మొఖంలో త్వరత్వరగా రంగులు మారిపోయాయ్.

"ఓ ! మీరా ?" అన్నాడు జీవంలేని చిరునవ్వుతో.

రాజేశ్వరి సిగ్గుపడింది.

"ఒంగోలులో చదివేప్పుడు వీళ్ళు నీ రూమ్ కెదురుగ్గా వున్న యింట్లో వుండేవారట కదా !" అడిగాడు అతని తండ్రి.

"ఆ.... అవును...." పొడిగా అన్నాడతను.

"అయితే- మీకు పెళ్ళిచూపులు— అప్పుడే అయిపోయినయ్యన్నమాట...." అందరూ నవ్వారు.

సుధీర్ కూడా నవ్వాడుగానీ అది అతను తెచ్చిపెట్టుకున్న నవ్వని తెలుస్తూనే ఉంది.

"ఇంక వెళ్దామా ?" తల్లితో అన్నాడతను.

"ఉండండి కాఫీ తెస్తున్నాను...." అంటూ త్వరత్వరగా లోపలకు నడిచింది యశోద.

రాజేశ్వరి మనసులో ఆందోళన ప్రారంభమయింది.

తనను చూసి అతనెందుకు సంతోషపడడం లేదు? అతని కళ్ళల్లో వెలుగూ, ఆనందం కనిపించవేం ?

ఆ తరువాత అతనింకేమీ మాట్లాడలేదు. కాఫీ తాగి లేచి వాళ్ళింటి కెళ్ళిపోయాడు.

రాజేశ్వరి తల్లిదండ్రులు వారేం చెప్తారో అన్న ఆత్రుతతో ఉన్నారు. అతనికి తను నచ్చిందా లేదా అనేదే వారి అనుమానం !

చివరకు మరో రోజు గడిచాక అతని తల్లి చెప్పింది.

"సుధీర్‌కి అమ్మాయి నచ్చలేదట."

రాజేశ్వరి బాధతో కృంగిపోయింది. గుండెల్లో గాయమయినట్లుందామెకి. తను అతనికి నచ్చలేదా ?

ఏం ? ఎందుకని ?

ఆ రోజు అంతగా తనను ప్రేమించి, అభిమానించిన అతని మనసు ఇప్పుడిలా యెందుకు మారిపోయింది ?

కళ్ళవెంబడి ఆగకుండా నీళ్ళు కారిపోసాగినయ్.


## బీదవారలకు శుభవార్త!



డాక్టర్ ఎన్. ఎస్. రావు
మా వైద్యశాల
ప్రధాన వైద్యులు

ఏ వ్యాధైనా వ్యాధి పేరు అర్థంగాకపోయినా, సంవత్సరములతరబడి బాధపడుతున్నా, వాపు, నొప్పి, మచ్చలు, దగ్గు, సుఖవ్యాధులు, ఆనెలు, కళ్ళ జబ్బులు, ఫిట్సు, స్త్రీల ముట్టు కుట్టునొప్పి, ఋతువ్యాధులు, పిల్లలు లేకపోవుట, దాంపత్యసుఖం లేకపోవుట, శరీర అవయవములు వుండవలసిన సైజులో వుండకపోవుట, ఊబగా పెరుగుట, చర్మవ్యాధులు, (అన్ని రకాలు) రక్తం విషతుల్యమగుట, మూలశంక మొదలగుగాగల వ్యాధులను వీరు నాడీ పరీక్షతో నిర్ణయించి వైద్యము చేయుదురు.

N. B ఇతర వైద్యశాలలోగాక, అనేక మొండి వ్యాధులను వీరు బాగుచేసి యున్నారు యోగ్యతాపత్రములు గలవు.

పరీక్ష ఫీజు రు. 15 మందుకు వ్యాధి ననుసరించి రు. 67 మొదలు రు. 155. చికిత్సకు చార్జీ చేయుదురు. మావద్ద మందు తిన్నవారి నెవరినైనా కనుక్కుంటే చెప్పగలరు. కాని మా వైద్యశాల స్థాపించి 25 సం॥లు అయింది. గాన ఈ సంవత్సరంలో మార్చి నెల సిల్వర్ జ్యూబిలీ ఇయర్‌లో పేదల మానంగా నిర్ణయించి, ప్రత్యేకంగా పేదల కొరకు క్యాంపు వేయుచున్నాము. ఇది ఈ నెల మాత్రమే. ఏప్రిల్ నుంచి మరల మామూలు రేట్లే. కాని ఈ విషయం గుర్తించి పేదవారలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరు.

ఈ నెల పరీక్ష ఫీజు రు. 5/- మాత్రమే. మందు ఖర్చు రూ. 10/- మాత్రమే ఈ నెలలో బుక్ అయిన ప్రతి రోగికి పూర్తి నివారణ అయ్యేవరకు నెలకు అదే రు. 10/- లు చికిత్స చేయగలరు. (పథ్యం లేదు).

క్యాంపుల వివరం : 5వ తేదీ : కర్నూలు, ఉడిపి హోటల్. 6వ తేది : గుంతకల్లు, శ్రీలాడ్జి. 7వ తేది : కడప, ద్వారకా లాడ్జి. 8వ తేది : తిరుపతి. ప్రతాప్ లాడ్జి. (బస్ స్టాండ్ ఎదురుగా) 9వ తేది : నెల్లూరు, రాఘవ విహార్, 10వ తేది : ఒంగోలు, హోటల్ అఖిలాప్. 11వ తేది : గుంటూరు, ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషన్ రోడ్డు. 12వ తేది : ఏలూరు, వసంతమహల్ లాడ్జి. 13వ తేది : కాకినాడ. ద్వారకా లాడ్జి. 14వ తేది : వైజాగ్, బృందావన్‌లాడ్జి, డాబా గార్డెన్స్. 15, 16 తేదీలు : రాజమండ్రి, శాంతినివాస్ 17వ తేది : విజయవాడ, మోడరన్ కేఫ్, గాంధీనగర్. 18వ తేది : ఖమ్మం, శేషమహల్, లాడ్జి, మయూర్ కేఫ్. 19వ తేది : వరంగల్, హోటల్ నటరాజ్.

ఉదయం 8 గం॥ నుంచి సా॥ 5 గంటల వరకు సంప్రదించవచ్చును.

### ఎన్. ఎస్. రావూస్ క్లినిక్

ప్లాట్ నెం. 471, జ్యూబిలిహిల్స్, హైదరాబాద్–500 034.

ఏమిటతని మనసు? ఎందుకలా చెప్పాడు? తనంటే యెందుకంత అయిష్టం కలిగింది?

ఆమెకు ఆలోచిస్తున్నకొద్దీ కోపం, అశాంతి పెరిగిపోసాగినయ్.

ఉహూ! అతనితో మాట్లాడాలి!

తనెందుకు నచ్చలేదో కనుక్కోవాలి!

ఎవరేమనుకున్నా సరే!

చీకటి పడుతోంటప్పుడే! సుధీర్ వాళ్ళింటి ముందు కుర్చీలో కూర్చుని టేప్‌రికార్డర్ వింటున్నాడు.

త్వరత్వరగా అతని దగ్గరకు నడిచింది రాజేశ్వరి.

ఆమెను చూసి అతను తెల్లబోయాడు. కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాడు.

"మీతో ఓ నిముషం మాట్లాడాలి!" అంది రాజేశ్వరి అతని వంకే చూస్తూ.

అతనికేం మాట్లాడాలో తెలీక మౌనంగా వుండిపోయాడు.

"మీరు నన్నెందుకు కాదన్నారో కారణం చెప్పగలరా?"

అతను సిగరెట్ వెలిగించుకున్నాడు.

"కారణాలు చెప్పి మిమ్మల్ని నొప్పించడం నా కిష్టం లేదు!"

"నేను నొచ్చుకుంటే బాధపడేంత అభిమానం మీ కెలాగూ లేదు. ఇంకా నటించడం యెందుకు? చెప్పండి!"

"సరే- అలాగయితే వినండి! నాకు మంచి కారెక్టర్‌గల అమ్మాయి కావాలి!

"ఓహో! నేను శీలం పోగొట్టుకున్న దానను కదూ?"

అతను మాట్లాడలేదు.

"కానీ నా శీలం కాజేసింది ఎవరో మీకు తెలీదా?"

"దీనికి జవాబు చాలారూడ్‌గా చెప్పాల్సి ఉంటుంది...."

"ఫరవాలేదు చెప్పండి!

"ఒకసారి నేను కాజేశాను— ఆ తరువాత మీ విషయాలు నాకు తెలీవుగా!"

"ఓహో- అంటే నేను వ్యభిచారిణినని మీ ఉద్దేశం- అంతేనా?"

"అలా అని నేననలేదు. కానీ ఆ రోజు నా దగ్గర ఎలాంటి ప్రతిఘటనా లేకుండా శీలాన్ని అర్పించిన మీరు- ఆ తరువాత ఇంకొకరితో కూడా అలా ప్రవర్తించలేదని ఏమిటి నమ్మకం?"

అతని చెంప ఛెళ్ళుమంది.

"ఇడియట్! నేను శీలం పోగొట్టుకోవడం తప్పుకాదు. కానీ నీలాంటి నీచుడి వలలో పడడం తప్పు...." అనేసి గిరుక్కున వెనక్కి తిరిగి తనింట్లోకి నడిచిందామె



